క్లుప్తంగా

3న సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు

తెనాలిఅర్బన్: ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, వైబ అమరావతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3న సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎన్వీఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. కళాశాలలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. సీఈవో నన్నపనేని భాస్కర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారి నమూనాలను త్వరలో జరగనున్న సైన్స్ డే వేడుకల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ విబిఎస్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎగ్జిబిషన్



తెనాలిటౌన్: పట్టణ దేవిచౌక్‌లోని షారోన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో గురువారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై ఆసక్తికరమైన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఆలోచన శక్తి, సృజనాత్మకత, పరిశోధించే తత్వాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని కొత్త ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాస్టర్ అహరం, స్కూల్ డైరెక్టర్ కె.శ్యామ్ బెనర్జీబాబు, ప్రిన్సిపాల్ మేరీ బెనర్జీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రానందంగా గాయత్రి దివ్యక్షేత్ర వార్షికోత్సవం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ పంచముఖ గాయత్రి ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యక్షేత్రం 8వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. విశ్వగాయత్రీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నంబూరి వెంకట కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఉదయం ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. అనంతరం గాయత్రీ మహాయజ్ఞం జరిపారు. ప్రత్యేక పూజలు అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షులు నంబూరి వెంకట కృష్ణమూర్తి ప్రారంభించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఆదిత్య త్రిపాఠి జరిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి యర్రంశెట్టి హనుమంతరావు, కోశాధికారి వెలివెల రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శి జొన్నాదుల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, పురంశెట్టి ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

కొలంకపురి సాంఘిక నాటక, నాటిక రచనల పోటీలు



గోపరాజు విజయ్

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో ప్రథమ సాంఘిక నాటక, నాటిక రచనల పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నేటి సమాజాన్ని ప్రతిబింబించే ఉత్తమ నాటకాలను సమాజంలోకి తీసుకురావాలనే భావనతో నిర్వహిస్తున్న పోటీల్లో వర్తమాన సమస్యలు, సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాలు, మానవ భావోద్వేగాలు వస్తువుగా ఉన్న రచనలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. నాటకాల్లో ప్రథమ బహుమతిగా ఆరిశెట్టి శివన్నారాయణ స్మారకంగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిని పరాంకుశం వెంకట భవానీ ప్రసాద్ (బాజ్జీ) స్మారకంగా బహూకరిస్తారు. నాటికల్లో ప్రథమ బహుమతిని దివంగత భారతుల రామకృష్ణ పేరిట రూ.20 వేలు, ద్వితీయ బహుమతిని దివంగత గంధం నాగరాజు పేరుతో రూ.10 వేలను అందజేస్తామని తెలియజేశారు. నాటక/నాటిక రచయితలు తమ రచనలను మే నెల 5వ తేదీలోగా గోపరాజు విజయ్, ప్రధాన కార్యదర్శి, 3–96/2, పోలవరపువారి వీధి, కొలకలూరు పోస్ట్, తెనాలి మండలం, గుంటూరు జిల్లా చిరునామాకు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు పిన్నమనేని మృత్యుంజయరావును 7794004466 నంబరులో సంప్రదించాలని వివరించారు.

కాంట్రాక్టర్లకు సత్వరం బిల్లులు చెల్లించండి

- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో వినతి
- పలు సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు



ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంజీవరెడ్డి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేసిన నిధుల ఆధారంగా కొందరు కాంట్రాక్టర్‌లు వాటి పనులు పూర్తి చేస్తున్నా ఇంజినీరింగ్ విభాగంలో బిల్లులను అప్‌లోడ్ చేసే ఉద్యోగులు కరవయ్యారని వైఎస్సార్‌సీపీ 34వ వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస కాంట్రాక్ట్ వర్క్స్‌కు చెందిన సుమారు 40 బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ కారణంగానే పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రావటం లేదని పేర్కొన్నారు. వెంటనే ఆ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ బండి శేషన్న ఈ అంశాన్ని పరిశీలించి మరోసారి ఫిర్యాదు రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ బండి శేషన్నను సభ్యులకు పరిచయం చేశారు.

మంచి నీటి సరఫరాను సక్రమంగా చేపట్టండి

తెనాలి పట్టణంలో రక్షిత మంచినీటి సరఫరాలో అనేక లోపాలున్నాయని, కుళాయిలు తీసుకున్న వారికి సైతం నీటిని ఎందుకు అందించలేక పోతున్నామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ప్రశ్నించారు. నీటి సరఫరాలో ఎదురౌతున్న సమస్యలను అధిగమించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకుందామని కమిషనర్ తెలిపారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు చదివి ఆమోదించారు. అత్యవసర సమావేశాన్ని నిర్వహించి దానిలోని అయిదు అంశాలు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, ఎంఈ కె నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ అనూషా, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు పురస్కారాలు



కోమలిని అభినందిస్తున్న లెఫ్టినెంట్ అధికారి మహేష్

తెనాలిరూరల్: స్థానిక ఐతానగర్‌లోని 22 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలో పరేడ్‌కు హాజరై అద్భుత ప్రతిభను చాటినందుకు గానూ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జె.మహేష్ అభినందనలు తెలియజేశారు. గురువారం ఐతానగర్‌లోని బెటాలియన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎన్‌సీసీ విద్యార్థులను సత్కరించారు. పరేడ్‌లో గత ఏడాది ఒక్క విద్యార్థి మాత్రమే పాల్గొన్నాడని, ఈ ఏడాది ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొనడం సంతోషకరమని అన్నారు. పరేడ్‌లో పాల్గొన్న క్యాడెట్స్ వీఎస్సార్ అండ్ ఏవీఆర్ కాలేజీ నుంచి సీనియర్ అండర్ ఆఫీసర్ ఎం.వంశీకృష్ణ, బాపట్ల ఫార్మసీ కాలేజీ నుంచి ఎస్.శ్రీకాంత్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ నుంచి కోమలిలను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. ఇందుకు క్యాడెట్స్ కృషి, శ్రమలతో పాటు వాళ్లకి ఉన్నత శిక్షణ ఇచ్చిన బెటాలియన్ పీఐ స్టాఫ్, కాలేజి ఏఎన్‌వో, సీటీవోలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. లెఫ్టినెంట్ జె మహేష్‌తో పాటు సుబేదార్ కృష్ణ జ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రచయిత్రి జ్యోతి స్వరూపరాణి మృతి



డాక్టర్ జ్యోతి స్వరూపరాణి (ఫైల్)

తెనాలి: పట్టణ చెంచుపేటకు చెందిన విశ్రాంత అధ్యాపకురాలు, రచయిత్రి డాక్టర్ గుజ్జర్లమూడి జ్యోతి స్వరూపరాణి (74) గురువారం తెల్లవారుజామున గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. జ్యోతి స్వరూపరాణి భర్త ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి ప్రస్తుతం దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఉన్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జ్యోతి స్వరూపరాణి జేఎంజే మహిళా కాలేజీలో అధ్యాపకురాలిగా, తెలుగు శాఖాధిపతిగా పని చేశారు. 'నన్నయ తీర్చిన శకుంతల' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ స్వీకరించారు. దాదాపు 150 పైగా రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 23 రేడియో నాటికలు, 10 నృత్య నాటికలు రచించారు. ఆమె రచనలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వ విద్యాలయాలు డిగ్రీ, పీజీ తరగతుల్లో పాఠ్యాంశాలుగా చేర్చారు. మరణానంతరం తన నేత్రాలను శంకర నేత్రాలయానికి దానం చేశారు. వివిధ రంగాల ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం ఆమె అంత్యక్రియలను పూర్తిచేశారు.

భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం

తెనాలిటౌన్: భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996కు అనుగుణంగా కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలీ డిమాండ్ చేశారు. పట్టణ మార్కెట్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెం 1214ను రద్దు చేయాలని కోరుతూ పురవేదిక వద్ద భవన నిర్మాణ కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో కార్మికులను ఉద్దేశించి హుస్సేన్‌వలీ మాట్లాడారు. 1996లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంక్షేమ పథకాలను నిలిపివేయడం సరికాదన్నారు. గత మూడు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీఐటీయు జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ వివాహ కానుక, ప్రసవ కానుక, పిల్లలకు స్కాలర్‌షిప్స్, కార్మికులకు టోల్ కిట్స్, జీవన భృతి, సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణించిన వారికి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి వాటిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో వేడుకగా సైన్స్ ఎగ్జిబిషన్

చెరుకుపల్లి: విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్సు పట్ల మక్కువ పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి సూచించారు. మండలంలోని పొన్నపల్లి ఐడీపీఎస్‌లో ఫిబ్రవరి 29న లీప్ డే సందర్భంగా స్పేస్ ఫెయిర్ మరియు మినీ నక్షత్రశాల, రాకెట్ ప్రయోగం తదితర అంశాలతో కూడిన నమూనా ఎగ్జిబిషన్‌ను గురువారం పాఠశాలలో నిర్వహించారు. ముందుగా పలువురు శాస్త్ర వేత్తల చిత్ర పటాలకు పూల మాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి సమాజంలో ప్రపంచాన్ని శాస్త్ర విజ్ఞానమే నడిపిస్తుందని వివరించారు. పాలపుంత, సౌర్య వ్యవస్థ, నక్షత్ర మండలాలు, మన దేశం ప్రయోగించిన వివిధ రాకెట్ నమూనాలు, ఉప గ్రహ నమూనాలతో పాటు అనేక రకాల వైజ్ఞానిక ప్రదర్శన నమూనాలను విద్యార్థులు తయారు చేశారు. వీటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తిలకించారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ వైస్ చైర్మన్ పైనం గణేష్ రెడ్డి, ప్రిన్సిపల్ నర్గీస్ క్వాజి, డైరెక్టర్ వారె ప్రసాద్ రెడ్డి, సుధా మాధవి, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రిలే దీక్షలను విజయవంతం చేయండి



కొల్లిపర: ఇటీవల దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపు కాలిపోయి నష్టపోయిన బాధితుల ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగే రిలే నిరాహార దీక్షలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని వల్లభాపురంలో రైతు సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరాహార దీక్షలను శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు ప్రారంభిస్తారన్నారు. ఢిల్లీ రైతుల పోరాట స్ఫూర్తితో పసుపు రైతులు ఉద్యమించాలన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి నుండి 22 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

తెనాలిరూరల్: ఎనిమిదో తరగతి విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన దమ్ము హెప్సిభారతి(13) ఐతానగర్ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనికి వెళ్లిన తండ్రి రాజు ఇంటికి వచ్చి చూడగా బాలిక ఉరికి వేలాడుతూ కనబడింది. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అత్తోటలో బీజేపీ ప్రజాపోరు యాత్ర

కొల్లిపర: మండలంలోని అత్తోట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వివిధ సెంటర్‌లలో బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, రైతుల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. పీఎం కిసాన్ యోజన కింద రైతులకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో రూ.2వేలు జమ చేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ముద్రించిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాపోరు కో కన్వీనర్ కొవ్వూరి శ్రీనివాసరావు, మండల బీజేపీ అధ్యక్షుడు మునగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు అశ్విన్, రామిరెడ్డి, దావులూరు గ్రామ అధ్యక్షుడు మణికంఠ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవటం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 19వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న షిల్ట్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణంలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు ఎక్కువగా ఉండటం వల్ల పారుదల నిలిచిపోతుందని చెప్పారు. ప్రతి వార్డులో ప్రణాళిక బద్ధంగా మురుగు కాల్వల పూడిక తీత పనులు చేస్తున్నట్లు వివరించారు. ఆమె వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె హెలెన్ నిర్మల, 19వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు చుండూరు సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్

తెనాలిరూరల్: కొల్లిపర మండలం దావులూరు అడ్డరోడ్డు వద్ద ఫిబ్రవరి 25న జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్య జరిగినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హత్య కేసు నిందితుల వివరాలను డీఎస్పీ రమేష్ తెలియజేశారు. కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివరావును అదే గ్రామానికి చెందిన చాగంటి రాజశేఖర రెడ్డి, దావులూరుకు చెందిన భార్యాభర్తలు సమ్మెట ఆంజనేయులు, సమ్మెట భూలక్ష్మిలు గొంతు కోసి హత్య చేసినట్లు చెప్పారు. మృతుడి తల్లి నాలాది విశ్రాంతమ్మ ఫిర్యాదు మేరకు కొల్లిపర ఎస్ఐ ఆర్.రవీంద్రారెడ్డి కేసు నమోదు చేయగా రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మృతుడు సాంబశివరావుకు, దావులూరుకు చెందిన సమ్మెట భూలక్ష్మికి గతంలో వివాహేతర సంబంధం ఉండేది. ఇరువురికి గొడవలు జరిగి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోగా ప్రస్తుతం ఆ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కాలంలో భూలక్ష్మి తమూలూరుకు చెందిన చాగంటి రాజశేఖరరెడ్డితో సన్నిహితంగా ఉండడంతో సాంబశివరావు తరచూ వారితో ఘర్షణ పడుతుండేవాడు. భూలక్ష్మి ఎక్కడ కనబడినా ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ అందరి ముందు అవమాన పరిచేవాడు. భూలక్ష్మి, ఆంజనేయులుపై సాంబశివరావు గతంలో పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసు కోర్టులో విచారణకు వచ్చింది. కేసులో రాజీకి రావాలని వీరు సాంబశివరావును కోరగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ కారణలతో అతడి అడ్డు తొలగించుకోవాలని భావించిన ముగ్గురు నిందితులు ఈ నెల 25న ఫూల్‌గా మద్యం తాగించి మత్తులో పడి ఉన్న అతడిని గొంతు కోసి హత్య చేశారు. దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసిన రూరల్ సీఐ టీ. వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవీంద్రారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు డి శ్యామ్ కుమార్, ఆర్ రాజేష్, బి. తాతారావు, కానిస్టేబుల్ ఎం. కూర్మారావులను డీఎస్పీ అభినందించారు.

ఎమ్మెల్యే కుటుంబీకుల ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిటౌన్: రూరల్ మండలం నేలపాడు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ సోమవరపు నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల కన్వీనర్ ప్రసాదం బాలగురవమ్మ, పార్టీ గ్రామ కన్వీనర్ సంకురు అవినాష్, నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని 19వ వార్డులో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికలల్లో ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శివకుమార్ చిన్న కుమారుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ కోరారు. గురువారం ఎన్నికలల్లో ప్రచారంలో భాగంగా వల్లభాపురం గ్రామంలో స్థానిక పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

తెనాలిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య రోడ్డులోని మున్షీ మస్తాన్ ఉర్దూ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ప్లేట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. క్లబ్ సభ్యులు ఇడవలపాటి వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా భార్య లీలావతి సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు ప్లేట్లు అందజేసి మాట్లాడారు. విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లయన్ అయినాల మల్లేశ్వరరావు, కొణిజేటి రమేష్‌కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ దిల్‌బహార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగి జీవితానికి సంతృప్తి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్సైను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్‌శాఖలో ఉద్యోగం పొందినప్పటి నుంచి పదవీ విరమణ వరకు సుదీర్ఘ కాలం విశిష్ట సేవలు అందించిన ఘనత వి.సీతారామనాయుడికే దక్కిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఆయనను గురువారం ఎస్పీ వకుల్‌జిందాల్ ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంతోనే సాధ్యమన్నారు. అలాంటి ఉద్యోగంలో చేరడం గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో ప్రవేశించి సుమారు 41 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించారని సీతారామనాయుడిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ వి.మల్లికార్జునరావు, వెల్ఫేర్ ఆర్ఐ డి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామంలోని వేణుగోపాల స్వామి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. విగ్రహాలను దాతలు వేల్పూరి శ్రీనివాసరావు, కనకారావు, బాల సుబ్రహ్మణ్యం, నారాయణరావు, నాగేశ్వరరావులు అందించారు. పూజా కార్యక్రమాలు వైదికుడు పరాశరం విజితేంద్ర ఆధ్వర్యంలో దీవి నాగ శేషాచార్యులు నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగాయి. శ్రీ సీతారామ కాపు సేవా సంఘం నిర్వాహకులు పర్యవేక్షించారు. స్వామి వార్లను వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సతీమణి దర్శించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

భావన్నారాయణుని ఆలయానికి పర్యాటక గుర్తింపు



బాపట్ల: చారిత్రక ప్రసిద్ధి పొందిన బాపట్ల శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయానికి రాష్ట్ర పర్యాటక శాఖ గుర్తింపు లభించడం హర్షణీయమని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా తొలి దశలోనే బాపట్ల ఆలయానికి ప్రత్యేక టూర్ ప్యాకేజీ లభించడంతో బాపట్ల ప్రజ ల చిరకాల వాంఛ నెరవేరినట్లయిందని ఆయన పేర్కొన్నారు. క్రీస్తు శకం 594వ సంవత్సరంలో క్రిమికంఠ చోళ మహారాజుచే నిర్మించబడిన 1400 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రగల ఈ ఆలయం తీరాంధ్రప్రదేశ్ లోనే తొలి వైష్ణవాలయం అన్నారు. మధ్యయుగంలో ఎన్నో విదేశీ దాడులను ఎదుర్కొని అలనాటి తన ప్రాభవాన్ని నేటికీ కోల్పోకుండా ఈ ఆలయం నిలిచిందని ఆయన తెలిపారు. భక్తులు ఆలయాలను ఎటువంటి వ్యయ ప్రయాసలకు లోను కాకుండా దర్శించుకునే విధంగా దేవదాయ పర్యాటక శాఖ సంయుక్తంగా రూట్ మ్యాప్‌ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.